పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి। చిత్తూరు। వై.ఎస్.ఆర్. కడప

## ఫోటోగ్రాఫర్ చక్రి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 11 :** సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు ఫోటోగ్రాఫర్ చక్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చక్రి తండ్రి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ నేలవల విజయశ్రీ పార్థసారథి దంపతులు నాయుడుపేట పట్టణంలోని చక్రి నివాసానికి వెళ్లి ఆయన తండ్రి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు ఆరు నెలల జీతాలు విడుదల

### ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కు కార్మికుల కృతజ్ఞతలు



**గూడూరు,పెన్ పవర్,ఆగస్టు 11:** గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆరు నెలలుగా బకాయిలు ఉన్న వేతనాలను కాంట్రాక్టర్ ద్వారా అందరికీ జీతాలు ఆరు నెలలకు ఇప్పించలాగా కృషి చేసిన ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా కు కార్మికులు, కార్మిక సంఘ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం గూడూరు ఏరియా ఆస్పత్రిలో ఆ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, ఆర్ఎంఓ ప్రసన్న లను కలిశారు. ఏడు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడ్డామని, ఇటీవల నెల జీతం వచ్చిందని, సూపరింటెండెంట్ మేడం స్పందించి కాంట్రాక్టర్ తో మాట్లాడి ఆరు నెలల జీతం వచ్చేలా కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, ఆర్ఎంఓ ప్రసన్నలకు కార్మికులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సీవీఆర్. కుమార్, కే. నారాయణ, జీ. శశి కుమార్, షేక్ జమాలుల్లా, వై. సునీల్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## వైసీపీ సమన్వయకర్త బుదురు గురవయ్యపై కేసు నమోదు

### డీఎస్సీ ర్యాలీ వ్యవహారంలో మరో 19 మందిపై కేసు



**గూడూరు,పెన్ పవర్,ఆగస్టు 11:** గూడూరులో నిర్వహించిన డీఎస్సీ ర్యాలీకి సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త బూదురు గురవయ్యతో పాటు మరో 19 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బూదురు గురవయ్యను ఏ1గా పేర్కొన్నట్లు సమాచారం. అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించడం, ప్రభుత్వాన్ని దూషించేలా వ్యాఖ్యలు చేయడం తదితర ఆరోపణలపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ర్యాలీ నిర్వహణకు సంబంధించి పోలీసుల అనుమతి తీసుకున్నారా లేదా, ప్రభుత్వాన్ని దూషించినట్లు చేసిన ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ వ్యవహారంపై వైసీపీ నాయకులు తదుపరి ఎలాంటి కార్యాచరణ చేపడతారన్నది ఆసక్తికరంగా మారింది.

## మెరుగైన పూర్వ ప్రాథమిక విద్యకు "జ్ఞాన జ్యోతి"





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 11 :** పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసి మెరుగైన విద్యను పిల్లలకు అందించడానికి జ్ఞానజ్యోతి కార్యక్రమం ఉపయోగపడుతుందని మండల విద్యాశాఖ అధికారి పీవీ రత్నం అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం డిఎల్ఎన్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుండి మూడు రోజులపాటు అంగన్వాడి టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆట పాటల ద్వారా పిల్లలకు విద్యను బోధించినట్లయితే ఆసక్తికరంగా, ఆనందంగా పాల్గొంటారన్నారు. తల్లిదండ్రులతో కలిసి సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి పిల్లల నమోదుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అభ్యసన ఆనందదాయకంగా, ఒత్తిడి లేకుండా కృత్యాల ఆధారంగా ఉండాలని పేర్కొన్నారు. మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాలలో ఆచరణాత్మకంగా చూపి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ డి.పద్మావతి, టి.నాగభూషణమ్మ, రిసోర్స్ పర్సన్స్ గండికోట సుధీర్ కుమార్,పి వి కే ప్రసాద్ రావు, వి రవి కుమార్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# చిన్న వర్షానికే చెరువులా మారిన నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణం





- కార్పొరేట్ స్థాయి వైద్యం మాటలకే పరిమితం
- నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణ పరిస్థితులు
- చిన్నపాటి వర్షానికే జలమయమైన ఆసుపత్రి ఆవరణ
- మోకాళ్ల లోతు నీటిలో రోగుల అవస్థలు
- గర్భిణీలు, బాలింతలు, వృద్ధులకు తప్పని తిప్పలు
- చిన్నారులను ఎత్తుకుని నీటిలోనే నడవాల్సిన దుస్థితి
- స్ట్రెచర్లపై రోగులను తరలించడంలో సిబ్బందికి ఇబ్బందులు
- సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకే సమస్య
- వర్షపు నీటికి బయటకు వెళ్లే మార్గం కరువు
- మురుగు నీటిలో నడవడంతో కొత్త రోగాల భయం
- హామీలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీపై ప్రజల్లో ప్రశ్నలు
- అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్నామని రోగుల ఆవేదన
- ఆసుపత్రి ఆవరణలో నీటిని వెంటనే తొలగించాలని డిమాండ్
- శాశ్వత పరిష్కారానికి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి
- పేదల ఆరోగ్యంతో చెలగాటం వద్దంటున్న నాయుడుపేట ప్రజలు

**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 11 :** తిరుపతి జిల్లా? నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పాలకులు చెబుతున్న మాటలు కోటలు దాటుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అగమ్యగోచరంగా ఉన్నాయి. దీనికి సాక్ష్యంగా నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి నిలుస్తోంది. రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే ఆసుపత్రి ఆవరణ మొత్తం నీట మునిగి, రోగులు, నరకయాతన అనుభవిస్తున్నారు. ?బుధవారం రాత్రి కురిసిన స్వల్ప వర్షానికి ఆసుపత్రి ముఖద్వారం నుండి లోపలి వరకు అంతా జలమయమైంది. మోకాళ్ళ లోతు నీటిలో నడవలేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలను ఎత్తుకుని నీటిలో నడవడం వారి ప్రాణాల మీదకు తెస్తోంది. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారిని స్ట్రెచర్ల మీద లోపలికి తీసుకెళ్లడం కూడా సిబ్బందికి తలకు మించిన భారంగా మారింది. ఆసుపత్రిలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఆవరణలోనే నిలిచిపోతోంది. ఈ మురుగు నీటిలో నడవడం వల్ల రోగులు కొత్త రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల కాలంలో సూళ్లూరుపేట శాసనసభ్యులు ఆసుపత్రిని సందర్శించి, సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు. కానీ, చిన్న చిన్న హామీలు కూడా నెరవేరడం లేదని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఏమైందని ప్రజలు మండిపడుతున్నారు. పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, వారి నిర్లక్ష్యానికి తాము బలి అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో నిలిచిన నీటిని వెంటనే తొలగించడాని కి అధికారులు చర్యలు చేపట్టాలి. శాశ్వత పరిష్కారం కోసం డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. అలాగే, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలి. పేద ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడటం తగదని, పాలకులు తక్షణమే స్పందించాలని నాయుడుపేట ప్రజలు కోరుకుంటున్నారు.

# శిధిలావస్థలో అంగన్వాడి భవనం చిన్నారులకు పొంచి ఉన్న ప్రమాదం...




- నాలుగు దశాబ్దాలుగా శిథిలావస్థలో అంగన్వాడీ భవనం
- బీటలు వారిన గోడలు.. ఊడిపడుతున్న స్లాబ్ పెచ్చులు
- ప్రమాదం పొంచి ఉన్నా అదే భవనంలో అంగన్వాడీ కేంద్రం
- అభం శుభం తెలియని చిన్నారులకు తప్పని ప్రమాదం
- ఆటపాటల మధ్య భయాందోళనలో చిన్నారులు
- మరమ్మతులు చేయకపోవడంపై అధికారుల తీరుపై ప్రశ్నలు
- కొత్త భవనం కోసం ప్రభుత్వానికి ఎందుకు ప్రతిపాదనలు పంపలేదని గ్రామస్తుల నిలదీత
- ప్రత్యామ్నాయ భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్తుల డిమాండ్
- చిన్నారుల భద్రతపై ఐసీడీఎస్ అధికారులు దృష్టి పెట్టాలి

**సూళ్లూరుపేట, పెన్ పవర్, ఆగష్టు 11 :** ఆగస్టు 15 కు 80వ స్వాతంత్ర దిన వేడుకలను జరుపుకోబోతున్నా! నేటికీ చిన్నారుల అక్షరాభ్యాస కేంద్రాలైన అంగన్వాడి– ప్రీ ప్రైమరీ పాఠశాలలు శిథిలావస్థ భవనాలలోని చిన్నారులు ఆటపాటలు – అక్షరాభ్యాసం చేస్తూ ఆ చిన్నారులు శిథిలమైన భవనంలోని కొనసాగుతున్నారు. దొరవారి సత్రం మండల పరిధిలోని కారికాడు గ్రామంలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్ర భవనం ఇందుకు నిదర్శనంగా ఆ గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తుంది. భవన నిర్మాణం నాలుగు దశాబ్దాల పైబడి శిథిలావస్థకు చేరింది. కొన్నేళ్లుగా గోడలు బీటలు వారి, స్లాబ్ పెచ్చులు ఊ డిపడుతున్న అంగన్వాడీ కేంద్రాన్ని శీతలమైన భవనంలో కొనసాగిస్తున్నారు. అభం, శుభం తెలియని అమాయక చిన్నారులు ప్రమాదం ఏ రూపంలో వస్తుందో తెలియక పాటలు పాటలు, కేరింతలతో కాలం గడుపుతున్నారు. గతంలో పాతబడిన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేశారు. ఈ భవన నిర్మాణం శిథిలావస్థలో ఉన్న దానికి ఐసిడిఎస్ అధికారులు ఎందుకు మరమ్మతులు చేయలేకపోయారు. ఆయుష్ కాలం చెల్లిన నిర్మాణాలకు కొత్త భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వానికి సిఫారస్తు ఎందుకు చేయలేదో ఆలోచించాల్సిన విషయమే. ఇలాంటి భవన నిర్మాణంలోనే కేంద్రాన్ని నడుపుతూ, పిల్లలకు ప్రమాదం పొంచి ఉన్న సంగతి సిడిపిఓ, సూపర్వైజర్ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదని గ్రామ ప్రజల ప్రశ్నిస్తున్నారు. పొరపాటున కాలం కలిసి రాక, చిన్నారులపై స్లాబ్ పెచ్చులు ఊడి పడితే ప్రమాదంతో కూడిన గాయాల గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీ పిల్లలకు అపాయం, ప్రమాదాలు జరగకముందే తగు జాగ్రత్తలు తీసుకొని, మరో ప్రాంతంలో ఏర్పాటు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారుల పైనే ఉంది.

## ఘనంగా యు. టి. యఫ్ 52 వ వార్షికోత్సవ వేడుకలు



**కావలి పెన్ పవర్ ఆగస్టు 11 :** కావలి పట్టణంలోని యు. టి. యఫ్ కార్యాలయం లో యు. టి. యఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిచారు. యు. టి. యఫ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి వందన సమర్పణ గావించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు పి. సుబ్రహ్మణ్యం, రామమూర్తి, ఆకుల. రమణయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బి. శ్రీదేవి తదితరులు మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనము, సామాజిక స్పృహ తో యు. టి. యఫ్ 52 వసంతాలు పూర్తిచేసుకొని సమాజానికి, ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలకు బాసటగా నిలచినట్లు పేర్కొన్నారు. కరువు, కరోనా తదితర విపత్కర పరిస్థితులల్లో సమాజానికి అండగా ఉన్న విషయాలను గుర్తు చేశారు. హక్కులు, బాధ్యత లను రెండు నేత్రాలుగా యు. టి. యఫ్ భావించి అలుపెరుగనిపోరాటాలు చేసి బతకలేని బడిపంతుల నుండి బతక నేర్చిన పండితునిగా నిలచే స్థాయికి ఉపాధ్యాయులను నిలబెట్టినట్లు ఉద్ఘాటించారు. లక్షలాది ఉపాధ్యాయ, ఉద్యోగ కుటుంబాల ప్రయోజనార్థం ప్రభుత్వం బడ్జెట్ గూర్చి కాకి లెక్కలు చెప్పకుండా ఆర్థిక హక్కులను కాపాడాలన్నారు. ఏ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినా ఉద్యోగుల హక్కులను కాలరాయాలని చూస్తోందని ఆ విధానం ఇకనైనా మారాలన్నారు. ఉపాధ్యాయులలో రానురాను ప్రశ్నించేతత్వం తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ బదలీలు, అప్రెంటీష్ రద్దు తదితరప్రయోజనాలు పొందడంలో యు. టి. యఫ్ కృషి మరువలేనిదిగా వర్ణించారు. పార్టీలతో సంబంధం లేకుండా అధికారం లో ఉన్న ప్రభుత్వం పై హక్కుల కోసం పోరాడటమే యు. టి. యఫ్ నైజమన్నారు. ఈ కార్యక్రమం లో పూర్వపు జిల్లాకార్యదర్శులు పి. మాధవ, వి. మాధవ, కావలి రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజీబ్ అహ్మద్, వేణుగోపాల్,జె. వి. వి అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు,కావలిపట్టణ, బోగోలు, జలదంకి, కొండాపురం బాధ్యులు, యు. టి. యఫ్ జిల్లా కౌన్సిలర్ గాదిరెడ్డి మురళీకృష్ణ పి. చెన్నక్రిష్ణయ్య, అధిక సంఖ్యలో యు. టి. యఫ్ నాయకులు, కార్యకర్తలు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొని మాట్లాడారు.

